చంద్రబాబుకు మతి భ్రమించింది

- 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



బుక్‌లెట్ అందించి పథకాలను వివరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు/ఆస్పరి: టీడీపీ నేత నారా చంద్రబాబుకు పదవి పోవడంతో మతి భ్రమించిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం ఆస్పరి మండలం ములుగుందం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగితెలుసుకున్నారు. ఏవైనా సమస్య లుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మూడున్నరేళ్లలో ఎవరెవరికి ఎంత లబ్ధి చేకూరిందో బుక్‌లెట్ అందజేసి వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పదవి పోవడంతో చంద్రబాబు జీర్ణించుకోలేక ప్రతి అభివృద్ధి పనికీ అడ్డుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ఆస్పరి సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్, ఆలూరు, ఆస్పరి మండల కన్వీనర్లు పెద్దయ్య, వీరేష్, రామాంజనేయులు, ఎంపీడీఓ రాధా, సీఈఓ అశోక్, శ్రీనివాసులరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, హనుమంతు, చిన్నఅయ్యప్ప, పురుషోత్తంరెడ్డి, ఎల్లప్ప, ప్రకాష్ పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

- ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి



అయ్యకొండలో బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: అయ్యలకొండ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. అయ్యకొండ గ్రామ సమీపంలో కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఆయన శనివారం సాయంత్రం పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. గోనెగండ్ల మండలం అయ్యకొండ గ్రామం నుంచి ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామాల మీదుగా వెళ్లేందుకు రూ.40 లక్షలతో తుంగభద్ర దిగువ కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టామన్నారు. ఈ బ్రిడ్జి పూర్తయితే అయ్యకొండ నుంచి కడిమెట్ల మీదుగా ఎమ్మిగనూరు తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం సులభమవుతుందన్నారు. ఆయన వెంట ఎమ్మిగనూరు మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, ఇరిగేషన్ డీఈ లక్ష్మణకుమార్, ఏఈ మణికంఠ, ధర్మకారి నాగేశ్వరరావు, క్లాస్–1 కాంట్రాక్టర్లు బి.వీరేష్ ఉన్నారు.

ప్రజలకు పాలన మరింత చేరువ



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: వార్డు, గ్రామ సచివాలయాల ఏర్పాటుతో పాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు మరింత చేరువ చేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శనివారం పట్టణంలోని వీవర్స్ కాలనీలో 17వ వార్డు సచివాలయాన్ని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమకు కావాల్సిన సేవలను సచివాలయంలో పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వార్డు కౌన్సిలర్ నీలకంఠ, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యూకే రాజశేఖర్, షబ్బీర్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్‌అహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు డిష్ కేశవరెడ్డి, అమాన్, తారా రాజశేఖర్, షాబుద్దీన్, గట్టు ఖాజ, కోటకొండ నరసింహులు, రజాక్, శ్రీను, సూరి పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ



భూ హక్కు పత్రం అందజేస్తున్న తహసీల్దార్ జయన్న

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి సచివాలయంలో లబ్ధిదారులకు శనివారం శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాలను తహసీల్దార్ జయన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వే పూర్తయిన రైతులకు శాశ్వత హక్కు పత్రాలు అందచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జర్మియా, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు చెక్

హొళగుంద: రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎల్లార్తి సర్పంచ్ కురువ చాముండేశ్వరి తెలిపారు. శనివారం సచివాలయంలో రైతులకు భూ రీ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేకు రైతులు సహకరించాలన్నారు. సర్వేయర్ రాజేశ్వరి మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన తర్వాత భూమి భూ హక్కు, భూరక్ష పత్రాలు అందజేస్తామన్నారు. సమావేశంలో వందవాగిలి సర్వేయరు గోవిందు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గిరి తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవ ఏర్పాట్లపై అధికారుల సమీక్ష



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి మహారథోత్సవం ఆదివారం ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తహసీల్దార్ జయన్న, సీఐ మధుసూదన్‌రావుతో కలిసి కమిషనర్ అధికారులు, ఆలయ ధర్మకర్తలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్ దీపాలంకరణ, తాగునీటి వసతి, పారిశుధ్య పనులు పూర్తయ్యాయన్నారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తుగా తమ వంతు చర్యలు తీసుకున్నామని ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు తెలిపారు. సమావేశంలో ఆలయ ధర్మకర్త మాచాని నాగరాజు నీల మురళీధర్, ట్రాఫిక్ ఎస్ఐ వెంకట సురేష్, కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నాగరాజు

మద్దికెర: యూటీఎఫ్ క్యాలెండర్–2023ను తహసీల్దార్ నాగరాజు శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంజీ నాగరాజు, విశ్వనాథ్, ఇబ్రహీం, ఆర్ఐ రవికుమార్ వీఆర్వోలు రంగస్వామి, రషీద్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

వెల్దుర్తి: ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను శనివారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ ఇందిర ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా, మండల ప్రతినిధులు మహేశ్వరరెడ్డి, ప్రవీణ్‌కుమార్, శివరామకృష్ణ, ఎల్లారెడ్డి, మహేశ్వర్, మునాఫ్, బాలకృష్ణ, మౌళాలి, నాగమద్దయ్య, మహేంద్రబాబు, సుదర్శన్ రెడ్డి, మహబూబ్‌బాషా, పరమేశ్వరుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో సల్ఫిబైతుల్‌మల్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత యునాని వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి యునాని వైద్యుడు ఎస్.ఖాద్రీ హాజరై 200ల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో యునాని వైద్యురాలు ఆస్మ, సల్ఫిబైతుల్‌మాల్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వెల్దుర్తి: స్థానిక బాలికల హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు వావిలాల కృష్ణమూర్తి శనివారం తెలిపారు. హైస్కూల్ ప్రారంభం నాటి నుంచి గత ఏడాది పదవ తరగతి పూర్తి చేసిన వారందరూ సమ్మేళనానికి హాజరుకావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోనెగండ్ల: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ శనివారం తెలిపారు. వేముగోడు-2లో బీసీ బీ, గోనెగండ్ల-7లో ఎస్సీ, బైలుప్పల-1లో ఓసీ, హెచ్.కై రవాడి-2లో ఓసీ(ఈడబ్ల్యూఎస్)లకు ఖాళీగా ఉన్నాయన్నారు. 7వ తరగతి పూర్తి చేసి, 21 నుంచి 35 ఏళ్లలోపు వయసు వారు ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు సంగీత విభావరి

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం సాయంత్రం జానపద సంగీత విభావరి, రేలారే..రేలా కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్‌కుమార్ శనివారం తెలిపారు.

పింఛన్ల పంపిణీ



పెంచిన పింఛను పంపిణీ చేస్తున్న నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు

ఆలూరు: దేవనకొండ ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ చైర్మన్ శ్రీనివాసులు పంపిణీ చేశారు. అలాగే దేవనకొండ మండల కేంద్రంలోని టర్నింగ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, ఎంపీపీ లక్ష్మీదేవి, మండల కన్వీనర్ మల్లికార్జున, ఎంపీడీఓ గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సింగిల్ అధ్యక్షుడు వై.పురుషోత్తంగౌడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందేలా కృషి చేస్తామని సర్పంచ్ విజయుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం, బురుజుల గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్‌రెడ్డి, సుబ్బయ్య, వేణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీజనల్ హాస్టల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ ఏపీసీ వేణుగోపాల్

తుగ్గలి: మండల పరిధిలోని జి.ఎర్రగుడిలో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్‌ను శనివారం సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాల్ తనిఖీ చేశారు. హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలపై విద్యార్థును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు చర్యలు తీసుకోవాలని వలంటీర్‌కు సూచించారు. అనంతరం జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల, తుగ్గలి కేజీబీవీని తనిఖీ చేశారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణుల య్యేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఏఎల్ఎస్ఓ శ్రీనివాస్ ఉన్నారు.

వ్యాపారులు సహకరించాలి

వెల్దుర్తి: ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలకు వ్యాపారులు సహకరించాలని ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం ఈఓఆర్డీ నరసింహులు, ఈఓ జేమ్స్ కృపవరం, సర్పంచ్ ముత్యాల శైలజతో కలిసి పట్టణంలోని వ్యాపారాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పాతబస్టాండు ప్రాంతంలో ట్రాఫిక్, అపరిశుభ్రత, పార్కింగ్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ప్రజా రక్షణ, ప్రజాసౌకర్యార్థం తాము తీసుకునే చర్యలకు వ్యాపారులు సహకరించాలన్నారు.

వరండా నిర్మాణానికి విరాళం

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని ఎర్రచెరువు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయ వరండా నిర్మాణానికి బేడ బుడగ జంగాల సంఘం మండల అధ్యక్షుడు విభూది బాలు శనివారం రూ.18,650 విరాళం ఇచ్చారు. విరాళాన్ని ఆలయ నిర్వాహకురాలికి అందించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

మద్దికెర: ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ హేమలత రైతులకు సూచించారు. శనివారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతుల నుద్దేశించి ఆమె మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటల వివరాలను గ్రామాల్లోని వ్యవసాయ శాఖ అధికారులకు సమర్పించి నమోదు చేయించుకుంటే ప్రభుత్వం అందించే పంటల బీమా, సబ్సిడీ ఎరువులు తదితర పథకాలు వర్తిస్తాయన్నారు.

దళిత కుటుంబానికి న్యాయం చేయాలి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన దళిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి రంగారెడ్డి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ కోరారు. సీపీఎం ప్రజాసంఘాలు, కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దారు, ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. దళిత రైతు నారాయణ కుటుంబ సభ్యులపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సాగుచేసుకుంటున్న భూమిని అతడికే ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మద్దికెర: గ్రామాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో పర్యటించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయన వెంట సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా ఉన్నారు.

రెవెన్యూ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పురుషోత్తం సూచించారు. శనివారం ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పొలాలకు సంబంధించిన సమస్యలపై నిత్యం రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని పూర్తిస్థాయిలో విచారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సమగ్ర భూ సర్వే పగడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్ఐ మస్తాన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ఆలూరు రూరల్: జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ అల్లబకాష్ సూచించారు. శనివారం ఆయన మండలలోని అంగస్కల్ జగనన్న లేవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. విద్యుత్, తాగునీటి తదితర సౌకర్యాలు కల్పించామని, నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి శాంతన, హౌసింగ్ ఏఈ జాఫర్ ఉన్నారు.

నేడు క్రికెట్ టోర్నమెంట్

పత్తికొండ రూరల్: ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జర్నలిస్టులు రాజేష్‌గౌడ్, మల్లికార్జున తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ జర్నలిస్టులు, న్యాయవాదులు, పోలీసులు, హెల్త్ సిబ్బందికి నిర్వహించనున్న క్రికెట్ పోటీలను జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ దివ్య ప్రారంభించనున్నారన్నారు.

రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



రైతులకు వరం.. భూరక్ష పథకం

- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రైతులకు వరమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనంలో దేవనబండ, తుగ్గలి మండలం లింగనేనిదొడ్డి గ్రామాల రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందేళ్ల తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూరీసర్వే చేపట్టారన్నారు. దేవనబండ, లింగనేనిదొడ్డి గ్రామాల్లో సమగ్రభూసర్వే పూర్తి కావడంతో సంబంధిత రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పత్తికొండ, తుగ్గలి తహసీల్దార్లు డి.విష్ణుప్రసాద్, రవి, పత్తికొండ ఎంపీపీ ఎం.నారాయణదాసు, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జుల ఉరుకుందమ్మ, ఎంపీడీఓ పార్థసారథి, సర్పంచులు పొట్లపాటి ప్రవీణ, కొమ్ము దీపిక, పూరి శ్రీరాములు, కురువ అంజినయ్య, అగసనూరు ప్రభాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మహాలక్ష్మి, నెట్టేకల్లు, నీలకంఠ, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్, శ్రీరంగడు, గాంధీరెడ్డి, జయచంద్రారెడ్డి, కారం నాగరాజు, రామచంద్ర, నార్ల తిప్పయ్య పాల్గొన్నారు.

రాతనలో పింఛన్ల పంపిణీ

తుగ్గలి: మండల పరిధిలోని రాతనలో ఎమ్మెల్యే శ్రీదేవి లబ్ధిదారులకు పింఛన్లు, రైస్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలో 98 శాతం హామీలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. దశలవారీగా పింఛన్ పెంచుతానని మాట ఇచ్చిన వైఎస్ జగన్ ఆ మేరకు ఇప్పుడు రూ.2,750 పెంచారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. రాతన పంచాయతీలో రూ.96 లక్షలతో జలజీవన్ మిషన్ కింద రెండు ఓహెచ్ఆర్ ట్యాంకులు నిర్మించి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషా, సర్పంచ్ రాచప్ప, వైస్ ఎంపీపీలు మల్లికార్జునరెడ్డి, నాగప్ప, కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేష్, జిల్లా కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి, అధికార ప్రతినిధి శ్రీరంగడు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఫోక్ అండ్ క్రియేటివిటీ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ పుష్పావతి, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ టీఎండీ హుసేన్, నాయకులు మోహన్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి



మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని కలుగొట్లలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కాలనీ, మైనారిటీ వీధుల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. మరోసారి జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, కలుగొట్ల జనార్ధన్‌రెడ్డి, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, భరత్‌రెడ్డి, పెద్దనాగేంద్ర, సురేశ్, హుసేన్‌మియ్య, జమీర్, సయ్యద్‌బాషా, మద్దిలేటి, ప్రభాకర్, కృష్ణుడు, నాగేశ్వర్లు, విష్ణు, ఈఓఆర్డీ నరసింహులు, ఆర్ఐ అబ్దుల్ కలాం పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

పత్తికొండ రూరల్: భార్య హత్య కేసులో భర్తను అరెస్ట్ చేశారు. నిందితుడి వివరాలను డీఎస్పీ శ్రీనివాసులు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. తుగ్గలి మండలం ఎల్లమ్మగుట్టతండాకు చెందిన గౌరీబాయిని, పత్తికొండ మండలం జీవరాళ్ళమల తండాకు చెందిన నెనావత్ రెడ్యానాయక్ దంపతులకు ఇద్దరు పిల్లలు సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గౌరీబాయి ప్రొద్దుటూరులో బంధువుల వద్ద ఉంటోంది. డబ్బు విషయమై ఆమె ఈనెల 4న పత్తికొండకు రాగా హీరో షోరూం ఎదుట ఉన్న హోటల్ వద్ద భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. క్షణికావేశానికి లోనైన భర్త రెడ్యానాయక్ కత్తితో పొడిచి హత్య చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేపట్టి జీవరాళ్లమల తండా క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ మురళీమోహన్ పాల్గొన్నారు.

'భూకొనుగోలుతో ఎమ్మెల్యేకు సంబంధం లేదు'

పత్తికొండ టౌన్: చిన్నహుల్తి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 150/3లో ఉన్న 5.05 ఎకరాల భూమి కొనుగోలులో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ఎలాంటి సంబంధం లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు అటికెలగుండు బాబురెడ్డి, వైస్ ఎంపీపీ కురువ బలరాముడు తెలిపారు. శనివారం పత్తికొండలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హోసూరు గ్రామానికి చెందిన నేటూరి కిష్టప్ప భార్య వెంకటసుబ్బమ్మతో తాము చట్టబద్ధంగా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామన్నారు. అంతకు ముందు నుంచి కౌలుకు సాగుచేస్తున్నవారు పొలాన్ని స్వాధీనం చేయకపోవడంతో ఆధారాలతో కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామన్నారు. ఇది తమ వ్యక్తిగత విషయమని ఎమ్మెల్యేకు అంటగట్టి రాజకీయ విమర్శలు చేయడం తగదని హితవుపలికారు. సమావేశంలో గుండు జిలాన్, హుసేన్‌పీరా పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నందవరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేదలకు మెరుగైన సేవలు అందుతున్నాయని డాక్టర్ సౌజన్యలత తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయం -2 ఆవరణలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 153 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలంతలు తప్పని సరిగా నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ, ఏఎన్ఎం దేవిప్రియ, హెల్త్ అసిస్టెంట్ ఫారుక్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరు టౌన్: జగనన్న కాలనీలలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. కావాల్సిన మౌలిక వసతులను ఇప్పటికే కల్పించామని, గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఏఈ తిలక్, అమెనిటీస్ సెక్రటరీలు ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

ఆలూరు రూరల్: బైక్ అదుపుతప్పిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన శివరామి రెడ్డి తన కుమారుడు శ్రీధర్‌రెడ్డితో కలిసి శనివారం స్కూటర్‌పై గుంతకల్లు పట్టణానికి బయలుదేరారు. ఆలూరు సమీపంలోని గుంతకల్లు క్రాస్ వద్ద బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. ప్రమాదంలో ఇద్దరికీ గాయా లు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వంద శాతం పన్ను వసూలు చేయాలి

గోనెగండ్ల: ఇంటి, కుళాయి, దుకాణాల పన్నులను వందశాతం వసూలు చేయాలని ఈఓఆర్డీ నాగేష్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

ఆలూరు రూరల్: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్ మల్లికార్జున అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆరు మండలాల బీఎల్ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదుపై అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని బీఎల్ఓలను హెచ్చరించారు.